క్లుప్తంగా

హోమ్ ఓటింగ్‌పై ప్రత్యేక దృష్టి

పార్వతీపురం టౌన్: హోం ఓటింగ్‌కు సంబంధించి పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో కొంతమంది బీఎల్‌ఓలు వృద్ధులు, దివ్యాంగుల వద్ద సరిగ్గా విల్లింగ్ తీసుకోవడం లేదని పలువురు వృద్ధులు అంటున్నారు. నియోజకవర్గంలో 80 ఏళ్లు దాటిన వారు 873 మంది, దివ్యాంగులు 3480మంది వరకూ ఉన్నారు. వీరందరికీ ఇంటి వద్దే ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఈ విషయమై ఆర్డీఓ కార్యాలయ ఏఈను వివరణ కోరగా హోమ్ ఓటింగ్‌కి సంబంధించి గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు ఫారం–12డీపై అవగాహన కల్పిస్తూ వారి నుంచి హోమ్ ఓటింగ్ లేక, పోలింగ్ బూత్ వద్ద ఓటింగ్ అంశంపై విల్లింగ్ తీసుకుంటున్నట్లు తెలిపారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి ఎంతమంది వినియోగించుకుంటున్నారని ఈ నెల 25న తెలియజేస్తామన్నారు.

వరి గడ్డికుప్పల దగ్ధం



కాలిబూడిదైన వరిగడ్డి కుప్పలు

మక్కువ: మండలంలోని కోన గ్రామం సమీపంలో శనివారం రెండు వరిగడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతులు పశుగ్రాసం కోసం గ్రామం సమీపంలోని సుమారు 17 వరిగడ్డి కుప్పలు నిల్వ చేశారు. వరిగడ్డి కుప్పలు వద్ద మంటలు వ్యాపించడంతో, గ్రామస్తులు సమీప పంట పొలాలు వద్దనున్న మోటార్ల సహాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. గ్రామస్తులంతా బిందెలతో నీటిని తీసుకొని వరిగడ్డి కుప్పలు ఆర్పగా, మిగిలిన 15 వరిగడ్డి కుప్పలకు మంటలు వ్యాపించకుండా నివారించగలిగారు. వరిగడ్డి కుప్పలు సమీపంలో విద్యుత్‌వైర్లు ఉండటంతో, వైర్లు కలిసి నిప్పులు చెలరేగి మంటలు వ్యాపించాయేమోనని గ్రామస్తులు అనుమానం వ్యక్తం జేస్తున్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



కొండబుచ్చమ్మపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నరసింహమూర్తి

మక్కువ: ఎన్నికల నియమ, నిబంధలను ప్రతీ ఒక్కరూ తెలుసుకొని, తప్పక పాటించాలని ఎస్‌ఐ పి.నరసింహమూర్తి సూచించారు. మండలంలోని కొండబుచ్చమ్మపేట, సరాయివలస గ్రామాలలో శనివారం ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నరసింహమూర్తి మాట్లాడుతూ వచ్చే నెల 13వ తేదీన జరగబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ఎన్నికల అధికారులు జరిపేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. స్నేహభావంతో అంతా మెలగాలన్నారు. ఎటువంటి గొడవలు సృష్టించరాదన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఎక్కడ ఏ ఇబ్బంది తలెత్తినా, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కుళాయి పనుల పరిశీలన



చినబోగిలిలో జేసీబీతో జరుగుతున్న ఇంటింటి కుళాయి పనులు

సీతానగరం: మండలంలోని చినబోగిలిలో నిర్దేశించిన గడువులోగా జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా చేపడుతున్న ఇంటింటి కుళాయిల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరాకు చర్యలు చేపట్టామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ అన్నారు. శనివారం చినబోగిలిలో జరుగుతున్న ఇంటింటి కుళాయి నిర్మాణ పనులు ఆయన పరిశీలించారు. గ్రామంలో రూ.28లక్షలతో సుమారు 670 ఇంటింటి కుళాయిల పనులు చేపట్టినట్టు తెలిపారు. ఆయన వెంట ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ప్రముఖ రంగస్థల నటుడు మృతి



కృష్ణుడి వేషధారణలో సంగమేశ్వరరావు(ఫైల్)

గరుగుబిల్లి: ప్రముఖ రంగస్థల నటుడు ఎన్ని సంగమేశ్వరరావు(75) శనివారం ఉదయం కన్నుమూశారు. మండలంలోని చినగుడబ గ్రామానికి చెందిన ఆయన స్వగృహంలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల కళాకారులు, సాహిత్యకారులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. సంగమేశ్వరరావు మృతి కళారంగానికి తీరని లోటు అని కొనియాడారు. తొలినాళ్లలో హార్మోనియం వాయిద్యకారుడిగా సుపరిచితుడైన ఆయన ఆ తర్వాత రంగస్థలంపై కృష్ణుడు, నక్షత్రకుడి పాత్రలు వేసి, అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో వేలాది ప్రదర్శనలు ఇచ్చారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

జగనన్నతోనే సుపరిపాలన

- ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావు



పట్టణంలోని 12వ వార్డులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్

పార్వతీపురం టౌన్:

రాష్ట్రంలో సుపరిపాలన కావాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రావాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఇళ్ల స్థలాలు, సొంతింటి స్థలం ఉన్న వారికి ఇళ్లు, విద్యుత్ లైన్లు, రోడ్లు సమస్యలను వార్డులోని పార్టీ నాయకులు తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరించామన్నారు. ఐదేళ్ల పాలనలో మీకు మంచి జరిగిందనుకుంటేనే ఓటు వేయండని ధైర్యంగా అడుగుతున్న దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. మీ అందరి చల్లని ఆశీస్సులతో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ తనూజారాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. చంద్ర బాబు మాయమాటలు నమ్మవద్దని, గత టీడీపీ పాలనలో జరిగిన అరాచకాలను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్ తాడ్డి అరుణ శంకర్రావు, కోఆప్షన్ సభ్యులు షేక్ షఫీ, జేఐఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, శుభలేక శ్రీను, పెద్ద రెడ్డి, చీటికన్నా, త్రినాధ, వివిధ వార్డుల కౌన్సిలర్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జమ్మిడివలసలో ప్రచారం

సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా డోర్ డెలివరీ చేయించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు అన్నారు. స్థానిక నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఆయన మండలంలోని జమ్మిడివలస గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన పలు సమస్యలను సావధానంగా విని, వాటిని తప్ప కుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాధరావు, బంకురు రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, స్థానిక సర్పంచ్ రాజేంద్ర ప్రసాద్, యాళ్ల ప్రతాప్, పోల సత్యనారాయణ, సువ్వాడ లావణ్య, నాయకులు గృహ సారథులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకే మన ఓటు



సీతానగరం: ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా ప్రజా సంక్షేమ పరిపాలన కొనసాగించి ప్రజలందరికీ మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోమారు ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి తమకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం పెదబోగిలి పంచాయతీ బుడ్డిపేటలో మండల నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే పరిపాలన తీసుకొచ్చిన ప్రజానాయకుడు జగనన్నకు మద్దతుగా నిలవాలని, ప్రతిపక్షాల కుట్రలను, కుతంత్రాలను తిప్పికొట్టాలని కోరారు. అంతకు ముందు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు మహిళలు తమ ఇళ్లకు తీసుకెళ్లి హారతులు, కుంకుమ తిలకం దిద్ది ఆశీర్వదించారు. అనంతరం బోగాలతల్లి అమ్మవారిని ఎమ్మెల్యే అలజంగి జోగారావు దర్శించుకుని అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రచార కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ సీనియర్ నాయకులు బి.శ్రీరాములునాయుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.జయమణి, పెదబోగిలి, సీతానగరం ఎంపీటీసీ సభ్యులు బి.కుసుమ, ఎస్.గౌరీ, పార్టీ మండల నాయకులు కె.రత్నాకర్, పార్ధసారధి, స్థానిక నాయకులు ఎస్.వెంకటరమణ, ఎం.సురేష్, ఎస్.లక్ష్మి, యు.సురేష్, ఎస్.రమేష్, సింహాచలం పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులు నిబద్ధతతో పని చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్

సాలూరు: పోలింగ్ పటిష్టంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు నిబద్ధతతో పని చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాలూరు నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు అందిస్తున్న శిక్షణా సమావేశాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధుల నిర్వహణ తదితర అంశాలపై అందిస్తున్న ఈ శిక్షణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేసారు. ఎన్నికల ప్రక్రియలో పీఓలు, ఏపీఓలు పాత్ర చాలా కీలకమని తెలిపారు. ఎక్కడా ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని, ఏమైనా సందేహాలు ఉంటే శిక్షణలో నివృత్తి చేసుకోవాలని సూచించారు.

మాక్ పోలింగ్ మొదలుకొని స్ట్రాంగ్ రూంలలో ఈవీఎంలను భద్రపరిచే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను వివరించారు. కోడ్ ఉల్లంఘిస్తూ, విధి నిర్వణహలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మాక్ పోలింగ్‌ను పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలను తనిఖీ చేసి పలు సూచనలు చేసారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ, సాలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై ఓటరు ఆసక్తి



విష్ణుచరణ్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి

సాలూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటరు తమ ఓటు వినియోగంపై ఆసక్తి కనబరుస్తున్నాడని ఐటీడీఏ పీఓ, సాలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ శనివారం చెప్పారు. కొటియా గ్రామాల ప్రజల తమ ఓటును వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై ఇప్పటికే మాక్ పోలింగ్ డ్రైవ్ ద్వారా అవగాహన కల్పించామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే 125 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ అవసరమని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. సాలూరు నియోజకవర్గంలో 243 పోలింగ్ కేంద్రాల్లో 32 మంది సెక్టార్ అధికారులు, 25 మంది రూట్ అధికారులను నియమించినట్టు తెలిపారు.

నేడు గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యే ప్రచారం

గుమ్మలక్ష్మీపురం: మండలంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కుంబురుక దీనమయ్య ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. సి.హెచ్.బిన్నిడి, ఆర్.జమ్ము, బాలేసు గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి, ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుమ్మలక్ష్మీపురం: కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈ కిశోర్‌కుమార్ ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. విద్యుత్ లైన్లు, స్తంభాల వద్ద ఉన్న ముళ్లపొదలు, తుప్పలు తొలగిస్తున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళశాసనం, శాత్తుమురై, తీర్థఘోష్టి, పుణ్యాహవచనం తదితర పూజా కార్యక్రమాలు చేశారు. స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

విస్తృతంగా తనిఖీలు



వాహన తనిఖీలు చేపడుతున్న ఫ్లెయింగ్ స్క్వాడ్



కారు డిక్కీలోని బ్యాగ్‌ల్లో సోదాలు చేస్తున్న ఎఫ్‌ఎస్‌టీ అధికారి చిన్నారావు

పార్వతీపురం టౌన్: రానున్న సాధారణ ఎన్నికలు నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు వాహనాల తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. శనివారం పట్టణంలోని రాష్ట్ర రహదారిపై వైకేఎం కాలనీ, పాత బస్టాండ్, రైల్వేస్టేషన్ జంక్షన్లలో వాహనాలను ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికార సిబ్బంది, ఎస్‌ఐ సంతోషి మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వాహనాల్లో అనుమతులు లేకుండా నగదు తరలించరాదని, నిషేధిత సరుకులు తరలించడం నేరమన్నారు. వాహనాల తనిఖీల్లో నగదు నిషేధిత సరుకులు పట్టుబడిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే రోజుకు మూడు షిఫ్టులతో 24 గంటలు వాహనాలు తనిఖీలు చేయడం జరుగుతుందని తెలిపారు. వాహనాలు తనిఖీ చేసే అధికారులకు వాహన చోదకులు సహకరించాలని కోరారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

సీతానగరం: మండలంలోని సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేస్తామని ఫ్లెయింగ్ స్క్వాడ్ టీం అధికారి కె.చిన్నారావు తెలిపారు. శనివారం రాష్ట్ర రహదారిలో లచ్చయ్యపేట, అంటిపేట, చినబోగిలి, కాశీపేట, గుచ్చిమి, సూరంపేట జంక్షన్లలో పోలీసుల సహకారంతో వాహనాలను తనిఖీ చేసారు. మే నెల 13 సాధారణ ఎన్నికలు నిర్వహించినంత వరకూ వాహనాలు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వాహన యజమానులు లిఖిత పూర్వకంగా నిర్ధారించుకున్న నగదు లేదా సరుకులు మాత్రమే తరలించాలని లేని పక్షంలో ఎన్నికల నిబంధనల అనుసరించి చర్యలు తప్పవని అన్నారు. తనిఖీల సమయంలో వాహన యజమానులు పోలీసులకు సహకరించాలని కోరారు.

రూ. 6లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

మక్కువ:

మండలంలోని ఏ.వెంకంపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు సుమారు రూ.6లక్షలతో సీసీరోడ్డును నిర్మించారు. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర గతేడాది జూన్‌లో గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రామాలయం వీధిలో సీసీ రోడ్డు లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు సచివాలయం కన్వీనర్ దొడ్డి హైమావతితో పాటు పలువురు డిప్యూటీ సీఎం రాజన్నదొర దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి రాజన్నదొర గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.6లక్షలు మంజూరు చేయగా, గ్రామంలో సీసీ రోడ్డును నిర్మించుకున్నారు. అలాగే గ్రామంలో రూ.42లక్షలతో గ్రామసచివాలయ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మావుడి సోదరులు తమ సొంత నిధులు సుమారు 50వేల రూపాయిలు వెచ్చించి, గ్రామంలో రామాలయం వద్ద బోరుబావిని ఏర్పాటు చేశారు.



గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

ఓటరు నమోదుకు రేపే తుది గడువు



పార్వతీపురం: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటరుగా నమోదు కావాలంటే ఈ నెల 15 ఆఖరి తేదీగా ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఏప్రిల్ 1వ తేదీకి 18 సంవత్సరాలు నిండిన వారు సోమవారంలోగా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు పరిశీలించి అన్ని వివరాలు సక్రమంగా ఉంటే తుది ఓటరు జాబితాలో పేరు చేరుస్తారు. ఆన్‌లైన్‌లో.. ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్ వెబ్‌సైట్‌లో మీఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ అవ్వాలి. ఆన్‌లైన్ దరఖాస్తులోని వివరాల ఆధారంగా బూత్ స్థాయి అధికారి మీ అడ్రస్‌కు వచ్చి మీ వివరాలను పరిశీలించి, నిర్ధారించుకున్న తరువాత ఓటరు జాబితాలో మీ పేరు చేరుస్తారు. అలాగే హెచ్‌టీటీపీఎస్//ఓటరు పోర్టల్.ఈసీఐ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్ లోకి వెళ్ళి మీ ఫోన్‌నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. లాగిన్ అయ్యాక వెబ్‌సైట్‌లో న్యూ ఓటరు రిజిస్ట్రేషన్‌లోకి వెళ్లి వివరాలు పొందుపరిస్తే నిర్ధారించుకున్నాక మీపేరు ఓటరు జాబితాలో చేరుస్తారు. మొబైల్ ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

బీఎల్‌ఓలకు దరఖాస్తు

18 సంవత్సరాలు నిండి ఓటరుగా మీకు అర్హత ఉంటే నేరుగా బూత్ లెవెల్ ఆఫీసర్‌లకు నేరుగా ఫారం–6 దరఖాస్తులు అందజేయవచ్చు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయవచ్చు. దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తరువాత మాత్రమే మీ పేరును ఓటరు జాబితాలో చేరుస్తారు. ఓటుహక్కు నమోదుపై ఎలాంటి సందేహాలున్నా టోల్ ఫ్రీ నంబర్ 1950కి ఫోన్‌చేసి నివృత్తి చేసుకోవచ్చు.

శరవేగంగా బీటీ రోడ్డు నిర్మాణం



దిగువసెంబికి శరవేగంగా నిర్మాణం జరుగుతున్న రోడ్డు

సాలూరు రూరల్: మండలంలోని పగులు చెన్నూరు పంచాయతీ దిగువసెంబికి రూ.7 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తోణాం నుండి డిప్పలపాడు, చోర, కుడకారు మీదుగా దిగువసెంబి వరకు 6.4 కిలోమీటర్లు రోడ్డు పనులు 85శాతం పూర్తి కావచ్చాయి. గిరిశిఖర గ్రామమైన దిగువసెంబికి గతంలో వెళ్లాలంటే గిరిజనులు కాలినడకన వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఈ రోడ్డు పనులు జరుగుతుండటంతో ఆయా గిరిజన గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కనీసం నడిచి వెళ్లాలన్నా నానా అవస్థలు పడే పరిస్థితుల నుండి ఏకంగా బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. జగనన్న ప్రభుత్వంలో గిరిశిఖర గ్రామాల అభివృద్ధిపై డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రత్యేక దృష్టి సారించారు.

ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురం టౌన్: ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల కీలకమని పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ఆర్డీఓ కార్యాయంలో పార్వతీపురం నియోజకవర్గం సంబంధిత ప్రిసైడింగ్ అధికారులు, సహా ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పీఓల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంలు, వీవీప్యాడ్ల పనితీరుపై పీఓలు, ఏపీఓలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ రోజున, సంబంధిత పోలింగ్ బూత్‌లో పీఓదే పూర్తి అధికారమని చెప్పారు. అందరి విధులపైనా పీఓలకు అవగాహన ఉండాలని సూచించారు. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, ఎట్టి పరిస్థితిలోనూ తప్పులు, పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. ఉదయం నుంచే వీలైనంత వరకు వేగంగా పోలింగ్ ప్రక్రియ జరపాలని సూచించారు. పీఓలు నిష్పక్ష పాతంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. పోలింగ్ ఏజెంట్లుగా వలంటీర్లు ఉండకూడదని స్పష్టం చేశారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

మక్కువ: మండల కేంద్రం మక్కువలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వై.నాయుడు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని శనివారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అంతకముందు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వై. నాయుడు అధ్యక్షతన విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కార్మికులకు అందించే హామీలపై స్పష్టమైన హామీలు ఇవ్వాలని కోరారు. రాజ్యాంగాన్ని కొన్ని పాలకవర్గాల శక్తులు నాశనం చేసేందుకు చూస్తున్నాయన్నారు. సీఐటీయూ మండల నాయకులు కృష్ణ, దాలమ్మ, ప్రభాకరరావు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కొమరాడ: ప్రజలు జ్వరాల బారినపడకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని కళ్లికోట గ్రామంలో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌తో పాటు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం పాటిస్తూ ఇంటి ఆవరణలో మురుగునీరు, చెత్తాచెదారం ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైతే నిల్వనీరు ఉంటుందో అక్కడ దోమలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని, దోమల బారినపడితే డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వస్తాయన్నారు. వేసవి ఎండల నేపథ్యంలో ప్రతిఒక్కరూ తరచూ నిమ్మరసం, మజ్జిగ, మంచినీరు తాగాలని తెలిపారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని, బయటకు వెళ్లేటప్పుడు తాగునీరు, గొడుగు వెంట తీసుకువెళ్లాలన్నారు.